


# నవభూమి వరంగల్
అనుబంధం
12 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:3
www.epaper.navabhoomi.in


## ఉద్యోగినిపై దాడి..
# నిందితురాలి అరెస్టు




**మట్టెవాడ, -నవభూమి:** వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో పని చేస్తున్న తాత్కాలిక ఉద్యోగిని సుమలతపై దాడి చేసి గాయపర్చిన ఆలకుంట్ల రాజమ్మను మంగళవారం మట్టెవాడ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ నందిరాంనాయక్, సీఐ తుమ్మగోపిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో రాజమ్మ ఆసుపత్రిలో ఉద్యోగినిగా పని చేసింది. ఆ సమయంలో తన సహకారంతోనే సుమలతకు ఉద్యోగం వచ్చిందని, అందువల్ల తనకు రూ. 2 లక్షలు ఇవ్వాలంటూ సోమవారం ఆమె సుమలతను గొలుసులతో కొట్టింది. ఇవ్వకపోతే చంపుతానని బెదిరించింది. సుమలత వద్ద ఉన్న రూ. 10వేల నగదును లాక్కొని ఆమె చరవాణిని పగులగొట్టింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితురాలి వద్ద రూ. 1000 నగదు, దాడికి ఉపయోగించిన గొలుసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మెల్యే నాయిని ఆగ్రహం మహిళపై దాడికి పాల్పడిన రాజమ్మపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు చేసే వారిపై రౌడీషీట్ తెరవాలని వరంగల్ పోలీసు కమిషనర్‌ను కోరారు.

# సాంకేతిక గణపతి



**డోర్నకల్, జనగామ -నవభూమి:** డోర్నకల్ మండలం పెరుమాండ్లసంకీస మండపంలోని వినాయక విగ్రహానికి జియో ట్యాగింగ్ చేస్తున్న పోలీసులు గణనాథుని ఉత్సవాల సందడి మొదలైంది. ఈ సంబురాలు ఆద్యంతం ప్రశాంతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఉత్సవాల్లో ఏ విధమైన అపశృతి దొర్లకుండా ఉండేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వినాయక విగ్రహాలు 7703 పోలీసుల నిరంతర నిఘా ముందస్తుగా ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశమై ప్రతి మండపానికి సంబంధించిన సమాచారం తీసుకున్నారు. కమిటీ సభ్యుల పేర్లు, చరవాణుల సంఖ్య సేకరించి ప్రతి మండపంపైనా నిరంతర నిఘా ఉంచారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు మండపాలు సందర్శిస్తూ తనిఖీల తాలూకు వివరాలన్నింటిని ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. అన్‌లైన్‌లో సమగ్ర సమాచారం ప్రతి పట్టటణం, మండల కేంద్రాలు, పంచాయతీలు, తండాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాల జియో ట్యాగింగ్ ఇప్పటికే ఒక కొలిక్కి వచ్చింది. పోలీసులు తమ వద్ద ఉన్న ట్యాబ్‌లో విఘ్నేశ్వరుని మండపం ఫొటోని బంధించి గణపతి విగ్రహాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జియో ట్యాగింగ్ చేయడం వల్ల ఆన్‌లైన్‌లోకి వెళ్లి లొకేషన్ ఆప్షన్ బటన్ నొక్కితే మండపం నెలకొల్పిన ప్రదేశం పేరు ఇట్టే తెలుస్తుంది. నిమజ్జనం ఏ రోజు, ఏ నీటి వనరులో చేస్తారనే వివరాలు కూడా కనిపిస్తాయి. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులిచ్చిన పోలీసులు ఇప్పుడు వాటికి జియో ట్యాగింగ్ చేయడంతో వాటి 'స్టేటస్'ని సులభంగా తెలుసుకుంటున్నారు. అవాంఛనీయ సంఘటనల నివారణకు ఇది తోడ్పాటునందిస్తుంది. ప్రతిదీ తెలుస్తుంది -తిరుపతిరావు, డీఎస్పీ, మహబూబాబాద్ వినాయక విగ్రహాలను జియో ట్యాగింగ్ చేయడం వల్ల క్షేత్ర స్థాయిలో మండపం వద్ద జరిగే ప్రతి అంశం పోలీసుల దృష్టికి వస్తుంది. ఏ ఊర్లో ఎన్ని.. ఏ మండలంలో ఎన్ని విగ్రహాలున్నాయనేది తెలుస్తుంది.

## చెయ్యేస్తే..
# చితక్కొట్టాలి

**భూపాలపల్లి, దేవరుప్పుల-నవభూమి:** పాఠశాలల్లో విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య సమాజంలో ప్రస్తుతం యువతులు, విద్యార్థినులపై పోకిరీల ఆగడాలు, వేధింపులు ఎక్కడో ఒక చోట కొనసాగుతున్న నేపథ్యంలో తమను తాము రక్షించుకునేలా పాఠశాలల్లో ఆత్మరక్షణ విద్యను అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. బాలికలపై సమాజంలో అక్కడక్కడా చోటుచేసుకుంటున్న కొన్ని అవాంఛనీయ పరిణామాలు అందరినీ కలవరపెడుతున్నాయి. దీంతో 'రాణి ఝాన్సీలక్ష్మీబాయి' ఆత్మరక్షణ శిక్షణ పేరుతో ఎంపిక చేసిన సర్కారు బడుల్లో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. చాలా వరకు పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో చదువులకే పరిమితం అవుతున్న విద్యార్థులకు వ్యాయామం అనేదే లేకుండా పోతోంది.. దీనికితోడు కొన్నిచోట్ల అమ్మాయిలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయి. ఆకతాయిల ఆగడాల నుంచి తమను తాము రక్షించుకోవడం, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం సాధించడం కోసం ఈ విద్య ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో కస్తూర్బా పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టగా ఆ తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. మూడు నెలల పాటు.. 2024-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 705 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో కరాటే శిక్షణ అమలుకు రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్షా నుంచి ఆదేశాలు అందాయి. మూడు నెలల పాటు ఆయా పాఠశాలల్లో బాలికలకు తర్ఫీదు అందించనున్నారు. ఈ నెల నుంచి వచ్చే ఫిబ్రవరి మధ్య దీన్ని పూర్తి చేయాలని, వారానికి మూడు శిక్షణ తరగతులు, నెలకు 12 తరగతులు బోధనకు ఆటంకం లేకుండా అనువైన సమయంలో నిర్వహించాలని ఆదేశించింది. ఇప్పటికే ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఒక్కో పాఠశాలకు నెలకు రూ. 5 వేల చొప్పున మూడు నెలలకు రూ. 15 వేల వరకు నిధులు కేటాయించారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కరాటే శిక్షణకు రూ. 96.24 లక్షల వరకు మంజూరయ్యాయి. ఈ మధ్య కాలంలో పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామాల్లో ఒకరిద్దరు అమ్మాయిలను కొందరు ఆకతాయిలు ఇబ్బంది పెడుతుండగా, బాలికలు ఎలాంటి ఆందోళన చెందకుండా సదరు ఆకతాయిల చెంప చెళ్లుమనేలా ధైర్యంతో ఎదిరించిన ఘటనలో బాలికలను ఉపాధ్యాయులు అభినందించారు. కరాటే సాధనలో జంగేడు కస్తూర్బా విద్యార్థినులు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.. - ఎం.రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి కరాటే శిక్షణతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థినులకు మూడు నెలలు ఆత్మరక్షణ విద్య కరాటే శిక్షణ ఇచ్చేందుకు ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ అవకాశాన్ని బాలికలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి.



## గంగారం మోడల్ స్కూల్‌ను సందర్శించిన సబ్ కలెక్టర్







**కాటారం,సెప్టెంబర్ 11 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం లోని గంగారం మోడల్ స్కూల్ ను బుధవారం కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ మండల పంచాయతీ అధికారి వీరస్వామి తో కలిసి అకస్మాత్తుగా సందర్శించారు.విద్యా బోధన,బోజన సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.తరగతి గదులను తిరుగుతూ, వంట గదిని తనికిచేసారు.మోడల్ స్కూల్ లో కావాల్సిన వసతుల గురించి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అమ్మా ఆదర్శ పాఠశాలలో పెండింగ్ లో ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.ఇంకా కావల్సిన పనుల గురించి ఆరా తీసి నోట్ చేసుకున్నారు.అమ్మ ఆదర్శ పాఠశాల పనుల గురించి పూర్తి స్థాయిలో నివేదికను తొందరలో అంద జేయాలని మండల పంచాయతీ అధికారి వీరస్వామి,ఏఈ లను ఆదేశించారు.ఈ కార్య క్రమంలో మండల పంచాయతీ అధికారి వీరస్వామి,ఏఈ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్ గణేష్ మండపాన్ని సందర్శించిన కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి



**కాటారం,సెప్టెంబర్ 11 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డిఎస్పి జి.రామ్మోహన్ రెడ్డి బుధవారం సాయంత్రం కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్ తో కలిసి ఆదర్శనగర్ లో ఏర్పాటు చేసిన గణపతి మండపం ను సందర్శించి గణపతి నవరాత్రి ఉత్సవాల గురించి అడిగి తెలుసుకున్నారు.గణేష్ మండపం వద్ద తగు జాగ్రత్తల తీసుకోవాలనీ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి,ఎస్ఐ మ్యాక అభినవ్,పోలీస్ సిబ్బంది, ఆదర్శనగర్ కాలని వాసులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు,
# మహా అన్నప్రసాద వితరణ,భజనలు













**కాటారం,సెప్టెంబర్ 11 నవభూమి ప్రతినిధి:** కాటారం మండలంలో పలు గ్రామాలలో వీధి వీధిన గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రోజున సబ్ స్టేషన్ పల్లె గణేష్ మండపం వద్ద గణపతి నవరాత్రుల్లో బాగంగా ప్రత్యేక పూజలు,భజన,కీర్తనలు చేసారు. ఎర్రగుంటపల్లె గణేష్ మండపం వద్ద కుంకుమ పూజలు నిర్వహించి,మాచర్ల మణి - సత్యనారాయణ దంపతుల ఆద్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఎఱ్ఱగుంటపల్లె గణేష్ మండపం వద్ద అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరోజు శ్రీనివాస్ తెలిపారు.నవరాత్రుల్లో బాగంగా ఐదవ రోజు గారెపల్లి గ్రామంలోని లక్ష్మీ దేవర ఆలయం లో గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కదారి సుభద్ర - రాజయ్య దంపతుల ఆద్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేసారు.ఈ మండపం వద్ద గణపతికి 51 కేజీ ల లడ్డు ను నైవేద్యంగా పెట్టారు.ఈ లడ్డూను నవరాత్రులు తర్వాత లక్కీ డిప్ ద్వారా తీయబడునని కమిటీ సభ్యులు తెలిపారు.రుసుం 10/- చెల్లించి గణేష్ మండపం వద్ద పేరు నమోదు చేసుకో గలరని మిత్ర మండలి సభ్యులు పేర్కొన్నారు. రెడ్డిగాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద కూడా గణపతికి ప్రత్యేక పూజలు,కుంకుమ పూజలు,అభిషేకాలు నిర్వహించారు.ఆదర్శనగర్ గణేష్ మండపం వద్ద కాలని వాసులు గణపతికి ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.అనంతరం సింగిరెడ్డి మదూకర్ దంపతుల ఆద్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేసారు.గారెపల్లి హనుమాన్ టెంపుల్ లో ఏకాహం (24 గంటల భజన)కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఐదవ రోజు గణపతి పూజా కార్యక్రమంలో భక్తులు భక్తి శ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

# ఉద్యోగాలిప్పిస్తామని దళారుల దందా


**వరంగల్ -నవభూమి:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు దళారులు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు.తెర వెనుక కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఉన్నట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికులు, వృద్ధాప్యానికి చేరుకున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే వీలుంది. ఇలాంటి ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈనెల 12న అధికారులు సమావేశం కానున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు దళారులు ఉద్యోగాలిప్పిస్తామని చూపుతూ ఒక్కొక్కరి నుంచి రూ.30-50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ముగ్గురు, నలుగురు శానిటరీ జవాన్లు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం.క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో..మృతి చెందిన, అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న ఒప్పంద కార్మికుల కుటుంబ సభ్యుల నుంచి తొలుత దరఖాస్తులను స్వీకరిస్తారు. వీటిని పరిశీలించే బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా అధికారుల కమిటీ ముందుకెళ్తుంది. కొందరు ఉద్యోగులు క్షేత్రస్థాయి పరిశీలన సమయంలోనే దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.వరంగల్, హనుమకొండలోని వివిధ డివిజన్ల పనిచేస్తున్న 30 మంది కార్మికుల నుంచి రీప్లేస్‌మెంటు దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే 90 శాతం దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.విచారణ చేపడతాం : -డాక్టర్ రాజేష్, ముఖ్య ఆరోగ్యాధికారి, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ రీప్లేస్‌మెంటు కార్మికుల నియామకాల కోసం ఈనెల 12న అధికారుల కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. వీరిలో చాలావరకు మృతి చెందిన కార్మికులే ఉన్నారు. డబ్బుల వసూళ్లపై విచారణ చేపడతాం.



## యంత్రాలు పాడైతే..మీనమేషాలు లెక్కిస్తున్నారు!




**భూపాలపల్లి –నవభూమి:** అసలే జ్వరాలు ముసురుతున్నాయి.. పల్లెలన్నీ మంచం పట్టాయి.. ఈ పరిస్థితిలో రోగ నిర్ధారణ తొందరగా జరిగితే తగిన వైద్యం అందించవచ్చు.కానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త కణ లెక్కింపు(సెల్ కౌంటర్) యంత్రాలు మూలకు చేరాయి. 2021 మే నెలలో జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీకి ఈ యంత్రాలను అందించారు. వీటి ద్వారా పలు రకాల రక్త పరీక్షలను నిమిషాల వ్యవధిలో పూర్తిచేసి వచ్చిన ఫలితాల ఆధారంగా అవసరమైన చికిత్స అందించాల్సి ఉంటుంది. కానీ, ఏడాదికే అవి మూలకు చేరాయి. రక్త కణాలు లెక్కించే(సెల్ కౌంట్) యంత్రం ద్వారా 23 రకాల రక్త పరీక్షలు చేసే అవకాశం ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్లేట్‌లెట్ కౌంట్, సీబీపీ, డబ్ల్యూబీపీ, ఆర్‌బీసీ, హెచ్‌బీ శాతం తదితర 23 రకాల పరీక్షలను ఈ యంత్రం ద్వారా చేపట్టే అవకాశం ఉంటుంది. కేవలం నిమిషాల వ్యవధిలోనే ఫలితాలు వస్తాయి. అలాంటి యంత్రాలను పట్టించుకోకుండా వదిలేయడం శోచనీయం.. పీహెచ్‌సీకి వచ్చిన రోగుల నుంచి తీసుకున్న రక్త నమూనాలు కేంద్రంలోని టీహబ్‌కు పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఫలితాలు ఒకరోజు తర్వాత వస్తున్నాయి. ఆ తర్వాతే చికిత్స అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత జ్వరాల సీజన్‌లో ప్రమాదకరమైన డెంగీ, వైరల్ ఫీవర్ తదితర వాటిని నిర్ధారణ చేయాల్సిన యంత్రం మూలకు పడటంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.కొన్నేళ్లుగా నిరుపయోగమే..చిట్యాల మండలం ఒడితల పీహెచ్‌సీలో సెల్ కౌంట్ యంత్రమిది.. కొన్నేళ్లుగా పనిచేయడం లేదు.. ఇక్కడికి వస్తున్నవారి రక్త నమూనాలు తీసుకొని టీహబ్‌కు పంపిస్తున్నారు. ఫలితాలు వచ్చే వరకు వేచి చూడాల్సిందే..మరమ్మతులకు గురై..మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సెల్ కౌంట్ యంత్రం మరమ్మతుకు గురై మూలకు పడింది. రక్త పరీక్షల నమూనాలను టీహబ్‌కు పంపితే.. 24 గంటల సమయం పడుతుండటంతో చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.ఎక్కువ ఓపీ ఉన్నా..చెల్పూర్ పీహెచ్‌సీలో సెల్‌కౌంట్ యంత్రం మరమ్మతులకు గురైంది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో నిత్యం ఓపీ ఎక్కువగానే ఉంటుంది. సెల్ కౌంట్ యంత్రం పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.త్వరలోనే మరమ్మతు చేస్తాం.. –డాక్టర్ మధుసూదన్, డీఎంహెచ్‌వో జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో 14 సెల్ కౌంట్ యంత్రాలను గతంలో అందించారు. అందులో 7 యంత్రాలు మరమ్మతుకు గురవగా ఇటీవల రెండు యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చాం. మిగిలినవి త్వరలోనే మరమ్మతు చేసేలా చర్యలు తీసుకుంటాం. సంబంధిత మెకానిక్ వచ్చి అంచనాలు కూడా పూర్తి చేశారు.




# ఆ ఒక్కటీ అడగొద్దు

**మహబూబాబాద్‌ –నవభూమి:** ఇదీ మానుకోట జిల్లా యంత్రాంగం తీరుఇప్పటికీ వెల్లడి కాని వరద నష్టం అంచనా మరిపెడ మండలం బాల్నిధర్మారం నుంచి ఖమ్మం జిల్లా పాతర్లపాడు వెళ్లే మార్గంలోని ఆకేరు వాగుపై నిర్మించిన వంతెన వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది.దాదాపు 100 మీటర్ల రహదారి సైతం కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నష్టంపై ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. అధికారులు మాత్రం నష్టం గురించి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.ఏటా వరదల వల్ల జరిగిన నష్టంపై జిల్లా యంత్రాంగం సమగ్ర నివేదికను వెంటనే రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచేది. ఈసారి అతిభారీ వర్షాలతో మునుపెన్నడూ జరగనంత భారీ నష్టం కళ్ల ముందు కనిపిస్తున్నా మహబూబాబాద్ జిల్లా యంత్రాంగం మాత్రం ఆ లెక్క అడగొద్దు అన్నట్లు వ్యవహరిస్తోంది. అన్ని విభాగాల నుంచి నష్ట వివరాలను కలెక్టరేట్‌లోని ఒక ముఖ్య అధికారి సేకరించి నివేదికను రూపొందించినా వాటిని వెల్లడించడానికి వెనుకాడుతున్నారు. ఏ వివరాలైనా నేరుగా మీడియాకు ఇవ్వకుండా జిల్లా పౌరసంబంధాలశాఖ (డీపీఆర్వో) ద్వారానే వెల్లడిస్తారని తెలిసి అతని ద్వారా తెలుసుకోవాలని ప్రయత్నించినా సమాచారం అందని పరిస్థితి. ఏ



వివరాలైనా జిల్లా పర్యటనకు వచ్చే కేంద్ర, రాష్ట్ర బృందాలకు మాత్రమే ఇస్తామని.. బయటికి చెప్పేది లేదని.. ఇందులో గోప్యత పాటించాలని జిల్లా పెద్ద సారు చెప్పారంటూ ఆ అధికారి తన వద్దకు వచ్చేవారిని తిప్పి పంపుతున్నారు.గోప్యత ఎందుకో..?: వరదల ధాటికి రోడ్లు, చెరువులు, కుంటలు, పంటలు, ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మూగజీవాలు మృతి చెందాయి. అధికారులు అంచనాలు వేయకముందే ప్రజలు నోటిమాటగా రమారమి లెక్కలతో ఒక అంచనాకు వచ్చారు. ఒక్కో ప్రాంతం ఒక్కోలా సుమారు రూ.200 కోట్లకు పైగానే నష్టం జరగొచ్చని భావిస్తున్నారు. కలెక్టరేట్ ద్వారానైతే సమగ్రమైన నష్టం వివరాలు తెలుస్తాయని ఆశించారు.ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నష్ట తీవ్రతపై సమీక్షించారు. అన్నిశాఖల అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో సర్వే చేసి సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. ఆమేరకు నివేదిక రూపొందించిన జిల్లా అధికారులు గోప్యతను పాటిస్తున్నారు.పొరుగు జిల్లాలో భేష్: మహబూబాబాద్‌కు పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. వరదల వల్ల శాఖల వారీగా ఎంత నష్టం జరిగిందనే వివరాలను ఆ జిల్లా అధికారులు ఇప్పటికే వెల్లడించారు. దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు నిర్ధారణకు వచ్చారు.

# నిర్లక్ష్యానికి ‘ఆవాసాలు’!

**జయశంకర్ భూపాలపల్లి, –నవభూమి:** సింగరేణి కార్మికుల నివాసగృహాలు సింగరేణి కార్మికులు, ఉద్యోగుల కోసం రూ.కోట్లు వెచ్చించి క్వార్టర్లు నిర్మించింది. వాటి కేటాయింపుల్లో జాప్యంతో సంస్థపై భారం పడుతోంది.కార్మికులు ఉద్యోగ విరమణ పొందినా, బదిలీపై వెళ్లినా ఖాళీ అయిన క్వార్టర్లలో అర్హులైన వారికి కేటాయించాలి. ఈ ప్రక్రియ సరిగా నిర్వహించకపోవడంతో సంస్థకు నష్టం వాట్టిల్లుతోంది. కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భూపాలపల్లి ఏరియాలో ఎం(డీ), ఎం(సీ), టీ(2), బ్యారెక్, తదితర రకాల 4,751 వేలకు పైగా క్వార్టర్లు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం 219 ఖాళీగా ఉన్నాయి. ఇందులో బ్యారెక్‌లు 148 కాగా మిగతావి వివిధ రకాలవి ఉన్నాయి. క్వార్టర్లు కేటాయిస్తే ఉద్యోగులు, కార్మికులకు నివాస యోగ్యమైన అన్ని వసతులు ఉంటాయి. వీటి కోసం కార్మికులు ఎదురుచూస్తున్నా.. సకాలంలో కౌన్సెలింగ్ నిర్వహించడం లేదు.నెలకు రూ.15.33 లక్షలు నష్టం నిరుపయోగంగా ఉన్న 219 నివాస గృహాలతో సింగరేణి యాజమాన్యానికి నష్టం వాటిల్లుతోంది. సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న కార్మికుడికి, అధికారులకు నివాస గృహాలను కేటాయించకపోతే వారి బేసిక్ పే ఆధారంగా 9 శాతం వరకు సింగరేణి సంస్థ ఇంటి అద్దె అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ) చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన సుమారు ఒక్కరికి కనీసం ఆరు నుంచి ఏడు వేల వరకు హెచ్‌ఆర్‌ఏ యాజమాన్యం ప్రతి నెలా చెల్లిస్తోంది. ఖాళీగా ఉంటున్న క్వార్టర్లను కార్మికులు, ఉద్యోగులకు పంపిణీ చేస్తే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించే అవసరం ఉండదు. దాదాపు 219 మందికి ఒకరికి రూ.7 వేల చొప్పున లెక్కిస్తే నెలకు సంస్థకు సుమారు రూ.15.33 లక్షల వరకు నష్టం ఏర్పడుతుంది. దీంతో ఆరు నెలల్లో దాదాపు రూ.91.98 లక్షలు భారం పడుతోంది.నిబంధనలకు విరుద్ధంగా కొందరు కార్మికులు ఇతరులకు అద్దెకు ఇవ్వడం, మరికొందరు రెండేసి నివాస గృహాలను వాడుకోవడంతో అదనపు విద్యుత్తు బిల్లులు, నీటి సరఫరా పేరుతో సంస్థకు నష్టం వాటిల్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా రెండు క్వార్టర్లు పొందిన ఐదుగురు ఉద్యోగులను గుర్తించారు. వారి నుంచి రూ.2.40 లక్షలను రికవరీ చేయాలని నోటీసులు జారీ చేసింది. కొన్నేళ్లుగా సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్న ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన కొందరు అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన ఇంటి అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. అధికారులు బదిలీ అయినా.. ఉద్యోగ విరమణ పొందినా వారి నుంచి అద్దె పూర్తిస్థాయిలో వసూలు చేసి, తర్వాత కొత్తగా వచ్చిన అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ సక్రమంగా చేపట్టడం లేదు.మూడు తనిఖీ బృందాలతో..ఈ ఏరియాలో సింగరేణి నివాస గృహాలను ఇతరులకు అద్దెకు ఇచ్చిన క్వార్టర్లు ఎన్ని..? రెండేసి క్వార్టర్లు వాడుకుంటున్నవారు ఎంత మంది..? ఎప్పటి నుంచి వాటిని వినియోగించుకుంటున్నారు..? ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఎన్ని క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు..? వారి వివరాల సేకరణకు ప్రత్యేకంగా మూడు తనిఖీ బృందాలను ఇటీవల ఏర్పాటు చేశారు. ఇందులో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా 150 మంది వరకు అద్దెకు ఇచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కార్మికుల నుంచి పీనల్ రెంట్ వసూలుకు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఇంకా మరో 60 క్వార్టర్లకు ‘డోర్ లాక్’ ఉండటంతో వాటిలో ఎవరు ఉంటున్నారనే సమాచారం సేకరిస్తున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల నుంచీ దాదాపు రూ.70 లక్షల వరకు ఇంటి అద్దె బకాయిలు వసూలు చేశారు. ఇంకా వసూలు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.పారదర్శకంగా కేటాయింపు –హబీబ్ హుస్సేన్, సింగరేణి జీఎం, భూపాలపల్లి త్వరలోనే ఖాళీగా ఉన్న క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, సీనియారిటీ కార్మికులకు నివాస గృహాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడ జీఎంగా పదవీ బాధ్యతలు తీసుకోకముందే క్వార్టర్ల కేటాయింపు ఇష్టారాజ్యంగా జరిగింది. ఇప్పుడు పూర్తిగా నిబంధనల ప్రకారమే సింగరేణి నివాస గృహాలను పారదర్శకంగా కేటాయిస్తాం.

